క్లుప్తంగా

పేదలకు బియ్యం పంపిణీ


ఏలేశ్వరంలో పేదలకు బియ్యం అందజేస్తున్న ఏఈ సూర్యనారాయణ

ఏలేశ్వరం: పట్టణంలో పేదలకు సోమవారం ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద ఏఈ డి.సూర్యనారాయణ ఆర్థిక సాయంతో సుమారు 20 మందికి ఉచితంగా బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా పేదలకు ఉచితంగా బియ్యం వితరణ చేశామన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ శ్రీను, లైన్‌మెన్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ కుటుంబానికి తోట పరామర్శ


బండారు శ్యామ్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న తోట నరసింహం

కిర్లంపూడి: మండలంలో రామచంద్రపురం గ్రామానికి చెందిన బండారు శ్యామ్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట కో ఆర్డినేటర్ తోట నరసింహం, యువ నాయకుడు తోట రాంజీ సోమవారం శ్యామ్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో తోట బాబ్జీ, ఎంపీటీసీ బండారు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తునిలో నేడు ర్యాలీ

తుని: దేశం కోసం ప్రాణాలు అర్పించిన సైనికులకు నివాళులు అర్పించేందుకు స్థానిక రాజా కళాశాల మైదానంలో మంగళవారం ఉదయం 8 గంటలకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు తుని రోటరీక్లబ్ కోశాధికారి కిశోర్‌రెడ్డి సోమవారం తెలిపారు. పట్టణంతో పాటు రూరల్ ప్రాంతాలకు చెందిన ప్రజలు తెలుపు రంగు దుస్తులు ధరించి హాజరు కావాలని ఆయన కోరారు.

సారాతో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ప్రత్తిపాడు, శంఖవరం మండలాల్లో సారా స్థావరాలపై సోమవారం దాడులు నిర్వహించినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో ఐదు లీటర్ల సారాతో గుబ్బల లక్ష్మిని, శంఖవరం మండలం నెల్లిపూడిలో ఐదు లీటర్ల సారాతో కొయ్యా ప్రసాద్‌ను అరెస్టు చేశామన్నారు. నిందితులను ప్రత్తిపాడు కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై జ్ఞానశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

సభావేదిక నిర్మాణానికి అస్సాగో చేయూత


పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రారంభిస్తున్న అస్సాగో ప్రతినిధులు

గోకవరం: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా అస్సాగో ఇథనాల్ పరిశ్రమ వెదురుపాకలోని ఎంపీయూపీ పాఠశాలలో సభావేదిక నిర్మాణానికి సహకారం అందించింది. పాఠశాల ప్రాంగణంలో సభావేదిక, సరస్వతీదేవి విగ్రహాన్ని సోమవారం పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ వీకే శుక్లా, ఐ.చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అస్సాగో పరిశ్రమ తరఫున గ్రామాభివృద్ధికి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎస్.బాబు, పి.చంటిబాబు, కొరిపల్లి అప్పలస్వామి, నాగవిష్ణు, మాజీ సర్పంచ్ బొట్టా రామకృష్ణ తదితరులుపాల్గొన్నారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:

తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835

కోటనందూరు:

తహసీల్దార్	80088 03205
ఎంపీడీఓ	98496 63415
మండల వైద్యాధికారి	76750 32399
వ్యవసాయాధికారి	83310 56617
ఎంఈఓ-1	89856 02864
ఎంఈఓ-2	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	86398 13895
పాతకొట్టాం పశువైద్యాధికారి	94919 34613
ఎస్సై	94409 00773
వెలుగు ఏపీఎం,	80088 04895
ఉపాధిహామీ ఏపీఓ,	70939 98217

సొంతగూడు కరవు

- పలు పంచాయతీలకు సొంత భవనాలు లేని వైనం
- కమ్యూనిటీ భవనాలు, రామాలయాల్లో నిర్వహణ
- అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణ పనులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రౌతులపూడి: మండలంలోని పలు గ్రామ పంచాయతీ కార్యాలయాలకు సొంతగూడు లేక ఏళ్లుకాలంగా అధికారులు, ప్రజాప్రతినిధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి సర్పంచ్, వార్డు సభ్యులు, అధికారులు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో స్థానికంగా ఉన్న కమ్యూనిటీ భవనాలు, రామాలయాలు, పాడుపడిన ఇతర ప్రభుత్వ భవనాల్లో తమ కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నారు.

గతంలో 20 పంచాయతీలు

మండలంలో గతంలో 20 పంచాయతీలుండేవి. శివారు గ్రామాల్లో స్థానికంగా సుస్థిరమైన పాలన అందించాలనే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత కల్గిన శివారు గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగానే గత ప్రభుత్వంలో మండలంలోని కొత్తగా మల్లంపేట, ఉప్పంపాలెం, బీబీ పట్నం, డీజే పురం, కోడూరు, మెరక చామవరం గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం మండలంలో 26 గ్రామ పంచాయతీలున్నాయి. పంచాయతీలుగా ఏర్పడి మూడున్నరేళ్లు గడిచినా నేటికీ ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో కమ్యునిటీ భవనాలు, రామాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పాలనాపరమైన నిర్వహణ చేపడుతున్నారు.

అసంపూర్తి పనులతో...

గ్రామ పంచాయతీలకు సొంతభవనాలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో మండలంలోని రాఘవపట్నం, ములగపూడి పంచాయతీ కార్యాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఆయా భవనాల నిర్మాణాలను సగంలోనే నిలిపివేశారు. నేటికీ వాటినిర్మాణాలు పూర్తిచేయకపోవడంతో భవనాల గోడలు, గదుల్లో తుప్పలు, చెట్లు పెరిగిపోయాయి. ఆయా గ్రామాల్లోని కమ్యునిటీ హాలు, పాఠశాల భవనాలు, చెట్ల కింద సభలు సమావేశాలు నిర్వహిస్తున్నారు.

పంచాయతీ భవనాల్లో ఇతర ప్రభుత్వ కార్యాలయాలు

మండలంలోని మేజరు పంచాయతీలు రౌతులపూడి, బలరామపురం గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయ భవనాల్లో ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ చేపడుతున్నారు. రౌతులపూడి పంచాయతీ కార్యాలయ భవనంలో ప్రస్తుతం పోలీస్ స్టేషన్ నిర్వహిస్తున్నారు. బలరామపురం పంచాయతీ భవనం స్థానంలో గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఆ రెండు గ్రామాల్లోనూ పంచాయతీ కార్యనిర్వహణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

శిథిలావస్థలో భవనాలు

గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యాలయ భవనాలు పూర్తిగా శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని లచ్చిరెడ్డిపాలెం, ఎస్ఎస్ పట్నం, ఎస్.అగ్రహారం, బంగారయ్యపేట గ్రామ పంచాయతీ కార్యాలయాలు గడిచిన పదేళ్లుగా శిథిలమై నిర్వీర్యమయ్యాయి. ఆయా భవనాల పైకప్పులు పెచ్చులూడిపోయి వర్షం వస్తే కార్యాలయాల్లో రికార్డులు తడిసిపోతున్నాయి. ఇప్పటికైనా పాలకులు గ్రామపంచాయతీ నిర్వహణకు అవసరమైన కార్యాలయ భవనాలను మంజూరు చేసి ప్రజలకు సుస్థిరమైన పాలన అందించాలని ప్రజలు కోరుతున్నారు.


ములగపూడిలో అసంపూర్తిగా నిలిచిపోయి తుప్పలు, చెట్లతో దర్శనమిస్తున్న పంచాయతీ కార్యాలయ భవన సముదాయం

సొంత భవనం లేక అవస్థలు

గత ప్రభుత్వం చొరవతో కొత్తగా పంచాయతీ ఏర్పడి మూడున్నరేళ్లు గడిచినా నేటికీ సొంత భవనం లేకపోవడంతో కమ్యునిటీ భవనంలో పంచాయతీ కార్యాలయ నిర్వహణ చేపడుతున్నాం. ప్రభుత్వ సమావేశాలు, గ్రామ సభలకు కమ్యూనిటీ భవనం వద్దే టెంట్‌లు ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తున్నాం. పంచాయతీ భవనం కోసం మండల పరిషత్ సమావేశాల్లో అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు.

పోలుపర్తి సీత, సర్పంచ్ మల్లంపేట, రౌతులపూడి మండలం

సచివాలయంలోనే పంచాయతీ నిర్వహణ

గ్రామంలోని పంచాయతీ కార్యాలయ భవనం పూర్తిగా శిథిలమైంది. భవనం పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. వర్షం వస్తే నీరు కార్యాలయంలో చేరి నిర్వహణకు అవస్థలు తప్పడం లేదు. దీంతో చేసేది లేక స్థానికంగా ఉన్న సచివాలయంలోనే పంచాయతీ కార్యాలయ నిర్వహణ చేపడుతున్నాం. ప్రభుత్వం పంచాయతీ నిర్వహణకు కొత్త భవనం మంజూరు చేయాలి.

సర్నం శ్రీనివాస్, సర్పంచ్ ఎస్.అగ్రహారం, రౌతులపూడి మండలం

ఘనంగా బాపనమ్మతల్లి జాతర


సోమాలమ్మ జాతరలో గరగను శిరస్సున ధరించిన తోట నరసింహం


ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

గోకవరం: మండలంలోని అచ్యుతాపురం గ్రామదేవత బాపనమ్మతల్లి జాతర సోమవారం ఘనంగా జరిగింది. సాయంత్రం ఆరు గంటల నుంచి విశేష సంఖ్యలో గ్రామస్తులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోరుకొండ సీఐ సత్యకిశోర్, గోకవరం ఎస్సై పవన్‌కుమార్‌లు బందోబస్తు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం, ఆయన తనయుడు తోట రాంజీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా సోమాలమ్మ జాతర

గండేపల్లి: మండలంలోని జెడ్.రాగంపేటలో సోమాలమ్మ జాతర సోమవారం వైభవంగా జరిగింది. పండితులు అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అష్టోత్తర శత పౌర్ణమి మహాహోమం జరిపారు. భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గరగ నృత్యాలు, తీన్‌మార్, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం, ఆయన తనయుడు తోట రాంజీలు గరగలను శిరస్సున ధరించి జాతరలో పాల్గొన్నారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఆయన వెంట పబ్లిసిటీ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రామకుర్తి జగాలు, వాణిజ్య విభాగం అధ్యక్షులు కరుటూరి వీర్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు రావుల గణేష్ రాజా తదితరులు ఉన్నారు.

వైశాఖ పౌర్ణమి పూజలు

గండేపల్లి: మండలంలో తాళ్లూరులో వేంచేసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో దుర్గాదేవి అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. లలితాదేవి ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

జగ్గంపేట: ఈ నెల 20న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్ నాయకులు పిలుపునిచ్చారు. జగ్గంపేటలో సోమవారం జరిగిన సమావేశంలో ఆ సంఘ నాయకులు మాట్లాడారు. కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అంగన్‌వాడీ, ఆశ, మిడ్డే మీల్స్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, రుణాలు మంజూరు చేయాలని, సబ్సిడీ కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఏసు, ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, బాలరాజు, పి.సునీత తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

ఇండోనేషియాలో గౌరవ అతిథిగా 'ఆదిత్య' ప్రొఫెసర్

గండేపల్లి: ఇండోనేషియాలో త్రిసక్తి ఇంటర్ నేషనల్ స్టూడెంట్ ఎక్స్చేంజ్ 2025 పేరిట నిర్వహించిన కార్యక్రమానికి ఆదిత్య యూనివర్సిటీ ప్రొఫెసర్ నీలిమ గౌరవ అతిథిగా హాజరైనట్టు ప్రో చాన్సలర్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. ఇండోనేషియన్ కల్చరల్ ఇన్‌సైట్స్ ఎక్స్‌ప్లోరింగ్ యోగ్యకర్తాస్ హెరిటేజ్ అనే ఇతివృత్తంతో రెండు వారాల పాటు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నీలిమ గౌరవ అతిథిగా హాజరై నాన్-వర్బ్ కమ్యూనికేషన్, ఏ గ్లోబల్ మైన్‌ఫీల్డ్ అనే అంశంపై ఉపన్యాసం చేశారు. ఆమెతో పాటు కార్యక్రమంలో పాల్గొన్న కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ప్రియాంవదా రాయ్, డేటా సైన్సెస్ విభాగానికి చెందిన జైత్రాకు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్స్ ఎంబీ శ్రీనివాస్, రమాశ్రీ, ఎ.రమేష్, జి.సురేష్, తదితరులు అభినందనలు తెలిపారు.


ఇండోనేషియన్లతో ఆదిత్య యూనివర్సిటీ ప్రొఫెసర్

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



ఏలేశ్వరంలో కేక్ కట్ చేస్తున్న నర్సులు

ఏలేశ్వరం: వైద్యరంగంలో నర్సులకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకుని సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో హెడ్‌నర్సు పరిమళరత్నం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎటువంటి తారతమ్యం లేకుండా రోగులకు వైద్యం అందించడంలో నర్సులు ముందుంటారన్నారు. నర్సులు మానవ సేవే- మాధవ సేవగా భావించి సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జానకి, శ్రీదేవి, సుమతి, రజని, శేషువేణి, నాగాయ్యమ్మ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణపై అవగాహన

శంఖవరం: డెంగీ వ్యాధి కారణంగానే ప్లేట్‌లెట్స్ తగ్గిపోతాయని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. మండలంలోని కొత్తూరులో ప్రజలకు సోమవారం వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదని, లక్షణాలకు అనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్ల లాగడం, వాంతులు, చలి జ్వరం, పంటి చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


కొత్తూరులో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

వైఎస్సార్ సీపీ నేతలపై కూటమి దౌర్జన్యాలు

మండి పడిన మాజీ మంత్రి తోట నరసింహం



జగ్గంపేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: వైఎస్సార్ సీపీ నేతలు రోడ్లు మీద తిరగకుండా కూటమి ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం మండిపడ్డారు. జగ్గంపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి విడుదల రజనీపై సీఐ ప్రవర్తించిన తీరు సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. ఎటువంటి తప్పులు చేయకపోయినా వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయడం, భయ పెట్టడం లాంటి కార్యక్రమాలను పోలీసులతో కూటమి ప్రభుత్వం చేయిస్తోందన్నారు. కేంద్రం టెర్రరిస్టులను ఏరిపారేస్తోందని, రాష్ట్రంలో రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తూ టెర్రరిస్టుల్లా ప్రవరిస్తున్న కూటమి నేతలపై చర్యలు చేపట్టాలని కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందన్న భయంతో కూటమి నేతలు ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నారన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చకుండా దగా పాలన చేస్తున్న కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు వ్యతిరేకతతో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో తోట రాంజీ, పార్టీ మండల అధ్యక్షుడు రావుల గణేష్‌రాజా, పట్టణ అధ్యక్షుడు కాపారపు ప్రసాద్, పార్టీ నేతలు రామకుర్తి జగాల్, భూమాడ గణపతి తదితరులు పాల్గొన్నారు.

'తిరగటి'కి కవిరత్న బిరుదు


కవిరత్న బిరుదు అందుకుంటున్న విజయరత్నం

కిర్లంపూడి: తామరాడ ప్రభుత్వోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న తిరగటి విజయరత్నం కవిరత్న బిరుదు అందుకున్నారు. ప్రపంచ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు శ్రీరంగశ్రీనివాస్‌రావు కళావేదికలో సీఈఓ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు నిర్వహించారు. ప్రతిభవంతులైన కవులు, కళాకారులు, జానపద కళాకారులు, సంగీత విద్వాంసులకు సన్మానం, బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. కాగా తిరగటి విజయరత్నానికి కవిరత్న బిరుదు అందజేసి ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్.కృష్ణ, స్టాఫ్ సెక్రటరీ బాలెం నూకరాజు, ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

సింగరమ్మతల్లి ఆలయ అర్చకులకు న్యాయం చేయాలి

జగ్గంపేట: జగ్గంపేట, గోకవరం మండలాల సరిహద్దుల్లో వేంచేసిన సింగరమ్మతల్లి ఆలయ అర్చకులకు న్యాయం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ డిమాండ్ చేసింది. జగ్గంపేట ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో సోమవారం లిబరేషన్ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. గత కొన్నేళ్లుగా ఆలయ అర్చకురాలిగా పనిచేస్తున్న వట్టికూటి సీతామహాలక్ష్మి ఇంటిని, కిరాణా షాపును ఇటీవల మల్లిసాలకు చెందిన టీడీపీ నాయకులు తొలగించడంతో ఆమె జీవనాధారం కోల్పోయిందన్నారు. జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తే ప్రాణాలు తీస్తామని బెదిరిస్తున్నారని, గోకవరం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టిసారించి న్యాయం చేయాలని కోరారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు కార్మికుల సమ్మె

సామర్లకోట: తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని పెద్దాపురం మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం ఆరో రోజుకు చేరింది. పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం చెవిలో పువ్వులు పెట్టుకుని, మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 15 ఏళ్లు దాటిన మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, విధి నిర్వహణలో చనిపోతే రూ.10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, స్కిల్, నాన్ స్కిల్ వర్కర్లను గుర్తించి కార్మిక చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో చేసిన సమ్మె సమయంలో హామీలిచ్చి, ఇప్పటి వరకు సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. దీంతో మళ్లీ సమ్మె చేపట్టినట్టు కార్మిక నాయకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వెంకన్నకు శ్రీచక్రస్నానం


మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం హోమం, మహాపూర్ణాహుతి, స్వామి, అమ్మవార్లకు శ్రీచక్రస్నానం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పౌర్ణమి, అన్నమాచార్యుల జయంతిని పురస్కరించుకుని వేదపండితులు శాస్త్రోక్తంగా హోమ క్రతువు నిర్వహించారు. ధర్మకర్తలు, భక్తులు పట్టు వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు సమర్పించారు. వసంతోత్సవం, శ్రీవారి పుష్కరిణిలో స్వామి, అమ్మవార్లకు చక్రస్నానం, శ్రీపుష్పయాగం, ద్వాదశ ఆరాధన, సప్తవరుణం, ధ్వజావరోహణం, కుంభ ప్రోక్షణ, మహదాశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించినట్టు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

జోరుగా వేసవి దుక్కులు


కోటనందూరులో దుక్కు చేస్తున్న రైతు

కోటనందూరు: మండలంలో గత 15 రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు భూమిలో తేమ పెరిగి పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో రైతులు జోరుగా వేసవి దుక్కులు చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికే తొలకరి పలకరిస్తుందనే వాతావరణ శాఖ ప్రకటనలతో రైతులు ముందస్తు ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్నారు. తొలిదశ దుక్కు చేసిన పొలాల్లో సేంద్రియ ఎరువు(పెంట) వేసి మరోసారి దుక్కు చేస్తున్నారు. తొలకరి పలకరింపే తడవుగా ఖరీఫ్ పనులు ప్రారంభించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. కాగా విత్తనాలు, ఎరువులను ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఏడాది కోటనందూరు మండలం 17 పంచాయతీల పరిధిలో సుమారుగా 10,500 ఎకరాల్లో వరి సాగు చేసే అవకాశం ఉన్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

అలరించిన 'అంబేడ్కర్' నాటకం


రౌతులపూడిలో నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

రౌతులపూడి: సమాజంలోని కుల వివక్ష, అసమానతలను రూపు మాపేందుకు సోమవారం ×సంఘం శరణం గచ్ఛామి× పేరుతో రౌతులపూడిలో ప్రదర్శించిన అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటకం ఆకట్టుకుంది. సామాజిక చైతన్య సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నాటకం ప్రదర్శించారు. ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న కులవివక్ష, అసమానతలను కళాకారులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. తొలుత ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, రౌతులపూడి ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతులను చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, గుమ్మరేగుల సర్పంచ్ రాపర్తి రామకృష్ణ, పైల వేణు, కేవీపీఎస్ అధ్యక్షులు అంద్రా మాల్యాద్రి, ఏఐఎంఎస్ రాష్ట్ర నాయకురాలు కొంకిపూడి రాజ్యలక్ష్మి, దళిత నాయకులు బర్రే రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరం ప్రారంభం

జగ్గంపేట: మల్లిసాల గ్రామ శివారులోని తపస్వి యోగి సిద్ధరామయ్య ఆశ్రమంలో ధ్యాన మందిరాన్ని సోమవారం ఆశ్రమ స్వామీజీ ప్రారంభించారు. 25 సంవత్సరాల క్రితం ఆశ్రమాన్ని స్థాపించి తపస్సు చేసుకుంటున్నానని, ఇతరులు కూడా ధ్యానం చేసుకునేవిధంగా 5 ఎకరాల స్థలంలో ధ్యాన మందిరాన్ని ఏర్పాటుచేసేందుకు సన్నహాలు చేస్తున్నట్టు స్వామీ తెలిపారు. ఈ ధ్యాన మందిరం ఏర్పాటుకు భక్తులు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు.